కున్న పిల్ల. అని మురిసిపోతూండగా కణతకి కొద్దిగా పైన నుదిటిమీద మచ్చ కనబడింది. ఈ చిన్న మచ్చ లేకపోతే ఎంతబాగుణ్ణు? అని పించింది కాంతారావుగారికి.

"కోడలు చక్కగా ఉందా?" అని పలకరించింది వియ్యపురాలి చెల్లెలు వీరమ్మ.

నుదుటిమీద మచ్చ లేకుండా ఉంటే ఎంత బాగుణ్ణు? అని చూస్తున్నానన్నా డాయన. ఏదైన ఒకవంక కనిపిస్తుందా? చూద్దామా అని వెతుకుతూ.

"మీరు తెచ్చిపెట్టుకున్నదేగా ఆ మచ్చ! మీ అబ్బాయి పదేళ్ళక్రిందట చింతచెట్టు చాటు నుంచి రాయి విసరకపోతే ఎంత బాగుణ్ణు? ఈ మచ్చకూడా ఈ పిల్లకి ఉండేదికాద"ని దెప్పింది వియ్యపురాలు. విస్తుపోయాడు వియ్యంకుడు, కథ విని ముక్కుమీద వేలేసుకున్నారు ముత్తైదువలు. ఆ మధురక్షణాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఔను! ఆవేళ ఆ పిల్లకి ఎంతగాయం తగిలింది! "అందరూ పూలతో బంతులాడుకుంటే మీ అబ్బాయి రాళ్లతో రత్నాలతో బంతులాడాడు!" అని పక్కనుంచి వినిపించిందొక సన్నని కంఠం.

అబ్బాయిచేతికి కంకణం కట్టడానికి వాచీ విప్పాడు - వాత ప్రత్యక్షం! చెయ్యి కోసుకుని రక్తాక్షరాలతో ప్రమాణం చేసాడు పెళ్ళికొడుకు అవేనా మధురక్షణాలు! తీయనితలపులా? ప్రణయ బాధలా? ఏమి టిదంతా! ఆవలించాడు తండ్రి.

కోయంబత్తూరులో కొడుకు ఆఫీసరు. కాంతారావు రిటైరై కొడుకుదగ్గరే ఉండిపోయాడు. సంధ్యవార్చుకుని జపంలోంచి కళ్ళు విప్పాడు తను. ఉదయభానుని అరుణకిరణాలు అబ్బాయి మీదపడి ఆడుకుంటున్నాయి. అబ్బాయి ఉంగలు కొట్టుకుంటూ అరుణకిరణాల్ని అందుకుంటున్నాడు. కొడుకు ఈజీచైరులో పడుక్కొని సిగరెట్టు తాగుతున్నాడు. నిశ్చింతగా కోడలు కాఫీ అందిస్తూంది. మళ్ళీ మధురక్షణాలు మందహాసం చేసాయి.

పాతిక సంవత్సరాలక్రితం పాలుతాగుతూ తల్లి ప్రక్కలో ఉంగలుకొట్టిన బాలకృష్ణుడు చింతచెట్టుక్రింద అమ్మాయిలమీద రాళ్ళురువ్విన బాలకృష్ణుడు కాలేజీచదువులో రక్తాక్షరాలు రాసుకున్న బాలకృష్ణుడు... ప్రేమతో పెళ్ళిపీటలమీద కూర్చున్న బాలకృష్ణుడు... మళ్ళీ మధుర క్ష ణా లు... బాలకృష్ణుని భాగ్యదేవత, భారతదేశపు భావిపౌరుడు ఉయ్యాలలో ఉంగలేస్తున్నాడు. మధుర క్షణాలు పరావర్తనంచెంది, పలకరించాయి. ఇంక ఒక్కటే మధురక్షణం... మిగిలింది. బాలకృష్ణుడు చేత్తో...భక్తిగా నిప్పు పెట్టడం.

పురాణమీమాంస

# పశ్చాత్తాపం

శంకరగంటి రంగాచార్యులు

అశోకవనంలో సీత చాలా రాత్రులు నిద్ర రాకుండా కళ్ళు తెరచుకొనేవుంటూ, ఒకనాడు తనకుకూడా తెలియకుండా మైమరచి నిదుర పోయింది.

* * *

అశోకవనంలో దుఃఖభారంతో కృంగిపోతున్న కాలంలో సీతకు అడుగడుక్కూ లక్ష్మణుడే జ్ఞాపకానికివస్తాడు. ఏమి కారణమో ఏమో కాని, ఎప్పుడూ రామచంద్రుణ్ణి తలంచుకుంటూవుంటే కూడా, అడుగడుక్కూ లక్ష్మణుడు వచ్చి తన కన్నుల ఎదుటనిలచినట్లూ, కన్నీళ్లునిండిన కళ్లతో "వదినా! ఇలాగు మీరు నాకు చెప్పవచ్చునా?" చూపుతోనే చెప్పుమాదిరిగాను తోస్తుంది. ఇది ఆమెకు సహింప సాధ్యంకాలేదు. రావణాసురుని నిర్బంధములో పడే దుఃఖానికన్నా ఇది ఆమెను అధికంగా బాధించింది. "అయ్యో! తమ్ముణ్ణి అనరాని మాటలని ఒక దోషమూ ఎరుగని వాడి మనస్సుకు గాయపరిచానే! రాక్షసుడు నన్ను

కౌగిలించుకొనివచ్చి చేసిన పాపానికన్నా, తమ్మునికి నేనొనర్చిన పాపమే ఎక్కువ!" అని తలచి తలచి పరితపిస్తుంది.

ఈమాదిరిగా ఆలోచనచేస్తూ,విచారిస్తూన్నందు వలన ఆమె ఆనాడు కనుమూస్తూనే తటాలున లక్ష్మణుడు అశోకవనములోకి ఒకటేదూకుదూకి వచ్చాడా అనువిధంగా కలలో కనపడ్డాడు.

లక్ష్మణుని చూస్తూనే సీతకు ఒకటే ఆనంద పారవశ్యం, భరింప సాధ్యం కాలేదు.

"ఆ! వచ్చావా తమ్ముడూ? నేను పడిన అగ పాట్లన్నీ కలలా?" అని ఆనందబాష్పములు కురిసింది.

"వచ్చేశా వదినా! ఇంక భయంలేదు కష్టం లేదు. నేను నిన్ను విడిచిపోయింది మహాపాపం. నీవు నన్ను క్షమించాలి!" అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు అప్పుడు నవ్విన నవ్వు వేకువ జాములో మంచు చుక్కలమీద తరణి కిరణములు పడినప్పటి దృశ్యంలాగుండినది. దుఃఖమూ, కన్నీళ్ళూ, నవ్వూ, సంతోషమూ కలిసిన ఆ నవ్వునుగురించి రాసేందు కెలా సాధ్యం?

"నేను చేసింది తప్పే తమ్ముడూ! అయినా నీవు నన్నలాగా ఒకతెనే విడిచిపోవచ్చా? నేను ఎంత తిట్టినాకూడా నీవు మీ అన్నగారికి చేసిన ప్రతిజ్ఞ తప్పవచ్చునా? నేనేదో మతిచెడి అనరానిమాట లన్నాను. అందుకోసం నీవు మీ అన్నకు చేసిన వాగ్దానానికి భంగం కల్గించవచ్చునా?" అన్నది సీత.

* * *

"ఏమి వాగ్దానం? ఏమి ప్రతిజ్ఞ? రామునికి నీవేదైనా వాగ్దానంకూడా చేశావా? నేను వినలేదే!" అన్నారు నారదులవారు.

["నారదులవారు ఇప్పు డెక్కడొచ్చారు. వారినిగురించి మీరేమీ చెప్పలేదే?" అని పాఠకు లడగవచ్చు. కలలోనడిచే విధానములనుగురించి ఈమాదిరిగా ప్రశ్నించకూడదు. నారదులవారు ఎలాగో వచ్చి అక్కడచేరారు. అది వారి అలవాటు, ఇది పురాణాలు చదివినవాళ్ళందరికీ బాగా తెలుసు.]

"వాగ్దానం చేయలేదా? ఇదేమి పెద్దవారు మీరుకూడా ఇలాగా మాట్లాడతారు?" అన్నది సీత. లోకమాత సీతకు నారదునిచూస్తే మాత్రం ఏంభయం?

సీత అడిగిన ప్రశ్నకు నారదుడు "నీమాటలు విని, తమ్ముణ్ణి ఇక్కడ ఉండమని చెప్పి రాముడొకటేపరుగున లేడివెంబడి పరుగెత్తాడు. తమ్ముడేమిచెప్పునో అన్నదికూడా నిలబడి వినకుండా పరుగెత్తాడే! లక్ష్మణుడు తన నోటితో ఒక ప్రతిజ్ఞకూడా చేయలేదే" అన్నారు.

ఇదంతా వింటూన్న లక్ష్మణుడు నవ్వాడు. "ఈమాదిరిగా మీరు వాదిస్తే నాకు నచ్చదు. ఇది ఒకవేళ బుషులకు సరిపోవచ్చు. నేను క్షత్రియుణ్ణి! నేను సహించలేను. అన్నగారు 'ఉండు' అని చెప్పగా గుడిసెవాకిట్లో నిలబడిందే ఒక ప్రతిజ్ఞ" అన్నాడు లక్ష్మణుడు.

"ఆతణ్ణి నమ్మికదా వారు వెళ్ళారు" అన్నది సీతకూడా.

"మీరిద్దరూ ఇంత సులభంగా ఒప్పుకుంటే నాదేమిటి ఆక్షేపణ? మీ యిష్టం." అన్నారు నారదులవారు.

* * *

"నేను తిట్టితేమాత్రం ఏమైంది." అన్నది సీత. "ఎందుకు ఊరువిడిచి, అంతఃపురాన్ని విడిచి అడవికొచ్చాము? ప్రతిజ్ఞకు భయపడికదా? భరతుడు చెప్పినది వినకుండా, ఊరివాళ్ళు చెప్పినది నిరాకరించి, వనవాసదీక్షవహించినది ప్రతిజ్ఞ పరిపాలనచేసేందుకు కదా!" అన్నది.

"సహింప సాధ్యంకాని పలుకులు పలికి నా హృదయాన్ని నొప్పిస్తున్నావు" అన్నాడు లక్ష్మణుడు కొంచెంసేపు సహించి.

"ఊరంతా తిట్టినా కూడా నీవు వున్నచోటు వదలి కదలవచ్చునా?" అన్నది సీత.

"ఔను. వదినా, నీవు చెప్పేది నిజం. ఆ రోజు నిన్ను విడిచిపోతూ సగం దారి నడుస్తూనే నాక్కూడా అలాగే తోచింది. వేన తిట్టినా కూడా అవి నన్నేం చేస్తాయి. అన్నగారికిచ్చిన వాగ్దానంకదా ముఖ్యమని వెనుతిరిగాను. పది అడుగులు గుడిసెవైపు వచ్చాను. . ."

* * *

పర్ణశాలలో సన్యాసివేషం ధరించిన రావణుడు సీత ఇచ్చిన పండును తింటూ వున్నవాడు

తటాలున వణకనారంభించాడు. అదే లక్ష్మణుడు పర్ణశాలవైపు వెనుదిరుగ చూచిన సమయం. వాడి ఎడమకన్నూ, ఎడమచేయి అదిరినై. పండును ఆకులో పెట్టి ద్వారంవైపు చూశాడు. లక్ష్మణుడు వచ్చేస్తాడు. కాళ్ళకు త్వరగా బుద్ధి చెప్పాలి" అని భయపడ్డాడు.

"భయపడవద్దు!" అన్నారు నారదులవారు. ఈ దుష్ట ఋషి మళ్ళీ ఎలాగో వచ్చి కలుసుకొన్నాడు.

(ఇదేమి కథ కొత్తరకంగా ఉన్నది. క్రమం గిమం లేకుండా ఇలాగు నడుస్తుంది. అశోకవన మెక్కడ? పర్ణశాల ఎక్కడ? . . . ఆక్షేపణ చెయ్యవద్దు. కల, అందులోనూ, మహా శోక సముద్రములో మునిగిన సీతకు. దానికి రీతీ, రంగమూ ఒకటీ లేదు.)

* * *

"పది అడుగులు నడిచాను పర్ణశాలకు రావాలనుకొని. వదినా! నీ కోపముతో జేగురువారిన కన్నులూ, ముడివడిన కనుబొమలూ, ఎదుటవచ్చి నిల్చినై. "ఆ! పోకుండా వచ్చావా; "దుష్టా!" అని కాళీ అవతారంలాగ నీవు నామీద పడినట్లు కనపడింది. మళ్ళీ వెనుదిరిగాను. అన్నా అంటూ. అన్నకిచేసిన ప్రతిజ్ఞ దూరంగా పరుగెత్తి పోయింది. నీవాడిన మాటలూ, నా అహంకారమూ బుద్ధికి మైకం క్రమ్మించాయి. ఏమైనా మానంకదా పెద్దదని పళ్ళుకొరుక్కుంటూ మాయ లేడి గొంతు వినబడిన చాయల్లో పోయాను."

"అయ్యో!"అన్నది సీత. "అప్పుడే నీవు వచ్చి ఉన్నట్లయితే బ్రతికి ఉందును కదా నేను" అని ఏడ్చింది.

"జరిగిన కథ జరిగింది. ఇప్పుడు పద,పోదాం! ఇంక పాతకథ ఎందుకు? నేనే వచ్చేశానుకదూ!" అన్నాడు లక్ష్మణుడు.

"తమ్ముడూ, నీకు నేనెంత అన్యాయంచేశాను. ఇందుకు ప్రాయశ్చిత్తమేమి?''అని పరితపించింది సీత.

"పద, పద!" అని సీతను హెచ్చరించాడు లక్ష్మణుడు.

కలలో అలా హెచ్చరించటం తోటే సీతకు మెలకువవచ్చి, కళ్ళు తెరిచింది. లక్ష్మణుడూ లేడు, నారదులూ లేరు. చుట్టూరక్కసిమూకలు. వాళ్లలో ఒకతె, "లే, లే! ఏమినిద్ర? రావణాసురుడు వస్తూవున్నాడు. అదిగో, ధ్వనిస్తూవున్నది శంఖం ఆయన చెప్పినట్లు చెయ్యి. మూర్ఖత్వం అవలంబించవద్దు! రాముడూ, లక్ష్మణుడూ కడలి కవతల ప్రయాసపడుతూ వున్నారు. వాళ్ళకు ఇక్కడికి వచ్చేందుకు అసలేమార్గంలేదు. నీవు రావణుని పెండ్లామువులే! సంతోషంతో ఒప్పుకో సిరిరా మోకాలొడ్డి, ఎందుకు బ్రతుకంతా వ్యర్థం చేసుకుంటావు" అన్నది.

"ఆ!" అని అరిచింది సీత. చెట్లూ, చేమలూ నిట్టూర్చినై.

ఇది జరిగిన మరునాడే మారుతి కడలిని ఒకే అంగతో దాటి లంకకు ప్రవేశించాడు. మారుతి వచ్చేందుకు సూచనగా సీత ఈ కల కన్నది. ఈ మాదిరిగా జరగబోయే సమాచారములను కలల్లో చూడటం సహజమేకదూ! సీత కలకన్నప్పుడు మారుతి తెలియదు కాబట్టి మారుతికి బదులుగా కలలో లక్ష్మణుని చూచింది.

తరువాత అశోకవంలో జరిగిన కథ అందరికీ తెలుసు. మారుతి ఎవరనేది తెలిసినతోడనే సీత మొదటమొదట వేసిన ప్రశ్న, "లక్ష్మణుడు సౌఖ్యమా?"అని. దీనితరువాతే భర్త క్షేమసమాచారములనుగురించి విచారించినది.

తాను లక్ష్మణునికి చేసిన అన్యాయమును గురించి సీత పడిన వేదన ఆమెకుతప్ప మరి ఎవ్వరికీ తెలియదు. ఎవరితోనూ చెప్పవీలుకాని బాధే క్రూరమైన బాధకదా?

సీత అనుభవించిన దుఃఖాన్ని తలచి మనం కూడా కొంచెం మన దుఃఖాలను మరచిపోవచ్చు. మారుతి "చిరంజీవి"అంటారు పెద్దవాళ్లు. అతడు ఇప్పుడుకూడా ఎక్కడచూచినా సహాయంచేసేందుకు కాచుకొని ఉంటాడు. దుఃఖము కలిగినప్పుడు "రామ,రామ"అని సహిస్తాం. మారుతి వచ్చి దుఃఖనివారణ చేస్తాడు అనే ఆశ మనకు ధైర్యాన్నిస్తుంది.

(తమిళంలో రాజాజీ వ్రాసిన రచనకు అనువాదం.)